క్లుప్తంగా

రాజీయే ఉత్తమ మార్గం



చాట్రాయి: కేసుల్లో ఇరువర్గాలు రాజీపడడం ఉత్తమ మార్గమని తిరువూరు అడిషినల్ సివిల్ జడ్జి ఎ. సింధూర అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిత్తపూరు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సింధూర మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పేదలకు ఉచిత న్యాయం అందజేయాలనే ఉద్దేశంతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించామన్నారు. ఏదైనా కేసు విషయంలో పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా ఇరువర్గాలు రాజీపడితే ఇద్దరికీ మేలు జరుగుతుందని చెప్పారు. అనంతరం మానవ హక్కులపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్లు అత్తునూరు శ్రీనివాసరావు, ఎం.సత్యం, చింతల వెంకటరెడ్డి, తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. లక్ష్మీనారాయణ, ఎఎస్ఐ స్వామి, డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబూఖారీ దర్గా పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా తండ్రి మహ్మద్ జిలానీ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. జిలానీ చిత్రపటానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా ప్రజలకు జిలానీ చేసిన సేవలను కొనియాడారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన మైలవరం జమీందారు సుధాకరరావు



మైలవరం: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు కుటుంబ సభ్యులు ఎస్వీఎన్ నివృతరావు, ఎస్. పృథ్వీ నరసింహారావు గురువారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, దేవాలయాల ఆస్తుల పరిరక్షణపై మంత్రితో చర్చించామని చైర్మన్ కార్యాలయం తెలిపింది.

నేడు హెచ్‌ఎంల సమావేశం

గంపలగూడెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు తోటమూల ఆదర్శ పాఠశాలలో జరుగుతుందని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణపై చర్చిస్తామన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలల హెచ్‌ఎంలు తప్పక హాజరుకావాలన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.కొండూరు: రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం, నాగులూరు, నరుకుళ్లపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ కిరణ్ తెలిపారు. సాంకేతిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

వ్యక్తికి గాయాలు

వినగడప(గంపలగూడెం): శ్రీనికేతన్–కొత్తపల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై వినగడప–అనుముల్లంక గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. గంపలగూడెంకు చెందిన షేక్ మైబుల్ (32) వినగడప నుంచి అనుముల్లంక మీదుగా గంపలగూడెం వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు తగలడంతో బైక్ అదుపు తప్పి మైబుల్ కింద పడి గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు.

ఉపాధి పనుల పరిశీలన



విస్సన్నపేట: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులను మండల ప్రత్యేకాధికారి పెద్దిబాబు, ఎంపీడీఓ జి. విజయకుమారి గురువారం పరిశీలించారు. స్థానిక సచివాలయం–2 వద్ద వాటర్ హార్వెస్టింగ్‌ను పరిశీలించారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



నూజివీడులో మాట్లాడుతున్న జిల్లా పీడీ పద్మావతి



తిరువూరులో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి రేష్మాబేగం

ఐసీడీఎస్ జిల్లా పీడీ పద్మావతి

నూజివీడు: తల్లిపాలు బిడ్డలకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ ఏలూరు పీడీ కేఏపీఎల్ పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం నిర్వహించిన తల్లిపాల ఆవశ్యకత కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బిడ్డకు తొలి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలన్నారు. పోత పాలు ఇవ్వడం ద్వారా బిడ్డలకు డయేరియా వచ్చే ప్రమాదం పొంచి ఉంటుందని చెప్పారు. ఆరు నెలల తరువాత తల్లిపాలతో పాటు పోషక పదార్థాలు ఇవ్వాలన్నారు. రెండేళ్ల వయస్సు వచ్చే వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వొచ్చని, వీటికి జతగా అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలని చెప్పారు. తల్లిపాల వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలు ఇవ్వడం ద్వారా రొమ్ము క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని, బిడ్డకు, తల్లికి మధ్య అనుబంధం పెరుగుతుందని, ఐక్యూ సైతం పెంపొందింపబడుతుందని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డలు సమాజానికి అందించబడతారని చెప్పారు. సీడీపీఓ ఎస్ఐ నూరాని, నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



జుపూడి నిమ్రా వైద్య కళాశాలలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభిస్తున్న ప్రొఫెసర్లు

● తిరువూరు: తిరువూరు పట్టణంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మాబేగం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ వైద్యారోగ్య శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో మేలు చేస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతాయని, బిడ్డ మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు.

తల్లిపాలతో రోగ నిరోధకశక్తి పెరుగుదల..

జూపూడి(ఇబ్రహీంపట్నం): తల్లిపాలతో చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని నిమ్రా వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ బాబూలాల్ అన్నారు. స్థానిక నిమ్రా వైద్య కళాశాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. ప్రముఖ మెడిసిన్ పీడియాట్రిక్ ప్రొఫెసర్లు వినయ్‌బాబు, రెహ్మాన్ ప్రారంభించిన శిబిరంలో బాబూలాల్ మాట్లాడుతూ తల్లిపాలు తాగిన వారిలో ఆస్తమా, ఊబకాయం, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని మెడికల్ సూపరింటెండెంట్ శ్యామలాదేవి కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లెలకు జ్వరమొచ్చింది

50 మందికి పైగా ఆస్పత్రుల్లో చికిత్స

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. చిట్టేల, మల్లేల, చౌటపల్లి, కాకర్ల, ఆంజనేయపురం గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. విష జ్వరం బారిన పడి ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు ముగ్గురు మృతిచెందగా 50 మందికి పైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దోమల నిర్మూలనకు పంచాయతీలు, వైద్యారోగ్య శాఖ చర్యలు చేపడుతున్నాయి. ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు వారం రోజులుగా మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలిస్తున్నారు. కాకర్లలో డెంగీ లక్షణాలతో ఇరువురు మరణించినందున తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చౌటపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వర పీడితులకు గ్రామాల్లోనే చికిత్స అందిస్తున్నారు.

డెంగీ లక్షణాలతో వ్యక్తి మృతి



మృతుడు నరసింహారావు (ఫైల్)

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో డెంగీ లక్షణాలతో ఓ వ్యక్తి గురువారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాడి నరసింహారావు (38) గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతూ తిరువూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జ్వర తీవ్రత తగ్గకపోవడంతో విజయవాడకు రిఫర్ చేశారు. జ్వర తీవ్రతకు తోడు కిడ్నీ సమస్య తలెత్తడంతో మృతి చెందాడు. మండలంలోని కాకర్లలో రేషన్ డీలరుగా పనిచేస్తున్న భారతి కూడా రెండు నెలలుగా జ్వరం తగ్గక చికిత్స పొందుతూ మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.

రెండు, మూడేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పూర్తి

మంత్రి పార్థసారథి

ముసునూరు: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు, మూడేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కె.పార్థసారథి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, నూజివీడు ఆర్డీఓ భవానీశంకరిలతో కలిసి గురువారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూజివీడు ప్రాంతానికి అత్యవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేస్తామని, మండలంలో డ్రెయినేజీలు, అంతర్గత రహదారుల సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో మొత్తం పింఛన్లు 7,973 కాగా, 7,701 పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. కార్యక్రమాల్లో డీటీ ఎమిలీకుమారి, డీఎల్పీఓ సుందరి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న మంత్రి పార్థసారథి, జేసీ, ఆర్డీఓ

96 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ

గంపలగూడెం: సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం మండలంలో 96 శాతం పూర్తయిందని ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. సచివాలయ సిబ్బంది పింఛన్‌దారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో లబ్ధిదార్లకు పింఛన్ నగదు అందజేసేందుకు సిబ్బంది రాజకీయ ఒత్తిడితో కొంత ఆలస్యం చేశారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. పింఛన్ల పంపిణీలో రాజకీయ నాయకుల ప్రమేయం ఏమిటని, ఏ పార్టీకి చెందిన వారైనా మంజూరైన నగదు పంపిణీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు వ్యాఖ్యానించారు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటేనే పింఛన్ ఇస్తామని సచివాలయం సిబ్బంది చెప్పినట్లు సమాచారం. ఇది సరైన పద్ధతి కాదని ప్రతిపక్ష పార్టీ నాయకులు అన్నారు.

● కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో గురువారం ఎన్టీఆర్ భరోసా భద్రత పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. రాయనపాడు, పైడూరుపాడు, షాబాదు, జక్కంపూడి గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ జరిగింది. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండలంలో 8,728 మందికి పింఛన్లు

జి.కొండూరు: మండల పరిధిలోని 8,728 మంది పింఛన్‌దారులకు రూ.3.67 కోట్లు ప్రతి నెలా అందుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెలగలేరు, కవులూరు గ్రామాలలో లబ్ధిదారులకు స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు.



తిరువూరు 11వ వార్డులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

● కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి, ఇబ్రహీంపట్నంలోని 10 వార్డు సచివాలయాల పరిధిలో 5,305 మంది లబ్ధిదారులకు గాను సాయంత్రం వరకు 5,145 మందికి 97 శాతం సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 4,845 మంది లబ్ధిదారులకు గాను 4,685మందికి 96.7శాతం పంపిణీ పూర్తయింది. మొత్తం రూ.2.03 కోట్లకు గాను 1.96 కోట్లు పంపిణీ చేశారు.

● ఆగిరిపల్లి: మండలంలో తొలి రోజు గురువారం 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ శామ్యూల్ తెలిపారు. 9,771 పింఛన్లకు గాను 9,400 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశామని చెప్పారు.

● చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ మంగా కుమారి తెలిపారు. మొత్తం 8,497 మంది లబ్ధిదారులకుగాను 8,173 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

● తిరువూరు: తిరువూరు మండలంలో పింఛన్లు 95 శాతం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు తిరువూరు 11వ వార్డులో పింఛన్లు అందజేశారు. తిరువూరు పట్టణంలో నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీఓ నాగేశ్వరరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

● నూజివీడు: పట్టణం, మండలంలో పింఛన్ల నగదును గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలో 5,279 మంది లబ్ధిదారులకుగాను 5,148 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 10,581 పింఛన్లకు గాను 10,346 పింఛన్లను పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో స్వీయ నియంత్రణ పెంపొందాలి

నూజివీడు: విద్యార్థులు స్వచ్ఛమైన మనస్తత్వాన్ని కలిగి ఉండాలని, స్వీయ నియంత్రణను పెంపొందించుకోవాలని యూత్ ఎంపవర్‌మెంట్ సంస్థ అధినేత సౌమ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగోటౌన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు రోటరీ ఆడిటోరియంలో గురువారం యూత్ ఎంపవర్‌మెంట్ సెంటర్ వారిచే మైండ్ ఎడ్యుకేషన్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. దక్షిణ కొరియా నుంచి వచ్చిన ఆ సంస్థ ప్రతినిధులు కొరియన్ భాషను విద్యార్థులకు పరిచయం చేస్తూ అవగాహన కల్పించారు. సౌమ్య మట్లాడుతూ గ్లోబలైజేషన్‌లో భాగంగా ప్రపంచమంతా కుగ్రామంగా మారిన నేపథ్యంలో ప్రతి విషయంలో పోటీ బాగా పెరిగిందని, ఈ పోటీలో విజయం సాధించాలంటే నైపుణ్యంతోపాటు ప్రత్యేక జ్ఞానం అవసరం అని వివరించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు దోనేపూడి నరేంద్రకుమార్, కార్యదర్శి కె. సత్యనారాయణ, సభ్యులు యార్లగడ్డ రాజగోపాల్, మలిశెట్టి శ్రీనివాస్, పీసీహెచ్ వెంకటేశ్వరరావు, సాయిభాస్కర్, సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కొరియన్ సంస్థ ప్రతినిధులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మండల ప్రత్యేకాధికారి వెంకట నారాయణ

కొత్తపల్లి(గంపలగూడెం): ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి పీడీ వెంకట నారాయణ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, సచివాలయ సెక్రటరీ మురళి పాల్గొన్నారు.

● వెల్వడం(మైలవరం): వెల్వడం గ్రామంలో జ్వరాలు నమోదైన నేపథ్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని గురువారం చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు గుంటలు, డ్రెయినేజీలలో దోమల నివారణకు ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. గ్రామంలోని డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వెల్వడం గ్రామ వీధుల్లో సున్నం, బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

గంపలగూడెం: గంపలగూడెం మండలంలోని 73 ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల కోసం ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. సంబంధిత ఓటర్ల జాబితాను కూడా పాఠశాలల్లో ఏర్పాటు చేశారన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 5వ తేదీన తెలియజేయాలన్నారు.

● ముసునూరు: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ఈమేరకు అన్ని పాఠశాలల్లోని నోటీస్ బోర్డుల్లో ఓటర్ల జాబితాలను గురువారం ప్రదర్శించారు. ఈనెల 5వ తేదీన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 8న ఎన్నికలు జరుగుతాయన్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెంలోని సుదీక్షన్ ఫౌండేషన్ ఆవరణలో ఈ నెల 4వ తేదీన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఫౌండేషన్ నిర్వాహకురాలు చిగురుపాటి విమల తెలిపారు. నడుము, మోకాళ్లు, కీళ్ల నొప్పులకు నంద ఆర్థోకేర్ విజయవాడ, పిన్నమనేని హాస్పిటల్ వైద్యులచే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచితంగా పరీక్షలు చేస్తారని చెప్పారు.

30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

మైలవరం: ఎమ్మార్పీఎస్ నేత మందా కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ యువసేన, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఇంకొల్లు జమలయ్య అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లో గురువారం విజయోత్సవాలు నిర్వహించారు. మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం..

చాట్రాయి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై మండలంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గురువారం హర్షం వ్యక్తం చేసింది. ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపకుడు చేసిన పోరాటం చరిత్రలో మరువలేనిదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగుమాటి రవిరాం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చాట్రాయిలో మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

● మైలవరం: మైలవరంలో దళిత చైతన్య వేదిక వద్ద ఎస్సీ జాతీయ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందా కృష్ణ మాదిగకు దళిత నాయకుడు, విశ్రాంత బీసీ సంక్షేమ అధికారి చాట్ల వీరాస్వామి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డి. బాలకృష్ణ, బి. యోహాను, పి. పాపారావు, పి.శ్రీను, ఎన్. భార్గవ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● రాయనపాడు(విజయవాడరూరల్): వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైనదని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వరావు మాదిగ అన్నారు. గురువారం రాయనపాడు గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవ అభినందన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మల్లాది వెంకటేశ్వరావు, ఎం. బాబురావు, ప్రత్తిపాటి సురేష్, కలపాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న వీరాస్వామి, నాయకులు

● భవానీపురం: గొల్లపూడి గ్రామంలో మాదిగ కులస్తులు సంబరాలు చేసుకున్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వెంకట్రావ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అశోక్ చక్రవర్తి, ఎస్.విజయ్‌కుమార్, యడవల్లి లోకేష్, పత్తిపాడు బాలు తదితరులు పాల్గొన్నారు.

● విస్సన్నపేట: సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక నూజివీడు రోడ్డులో గురువారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును హర్షిస్తున్నామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గొర్రె లాజరస్ అన్నారు. మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, మల్లాది వీరయ్య, మేకపాం కృష్ణచైతన్య, బీజేపీ నాయకులు పులపాక బాబు, లాం కొండలరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం

గంపలగూడెం: స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ డి. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి వెంకటేశ్వరరావు దంపతులను ఎస్ఐ ఎస్. శ్రీను, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు క్రమశిక్షణతో విధులను నిర్వహించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నెస్పీ టెక్నికల్ ఆఫీసర్ పిచ్చయ్యకు సత్కారం

నూజివీడు: ఉద్యోగ కాలంలో సమర్థవంతంగా పని చేసి అందరి మన్ననలు అందుకున్న వ్యక్తి వేల్పుల పిచ్చయ్య అని ఎన్నెస్పీ ఈఈ కె. గోపీనాథ్ అన్నారు. స్థానిక ఈఈ కార్యాలయ ఆవరణలో గురువారం ఎన్నెస్పీలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పిచ్చయ్యను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈఈ మాట్లాడుతూ పిచ్చయ్య పనితీరు మిగిలిన సిబ్బందికి ఆదర్శనీయమన్నారు.



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది




నూజివీడులో వేల్పుల పిచ్చయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు, బంధువులు, కుటుంబ సభ్యులు

ఖాసింబీకి ఉమెన్ ఎక్స్‌లెన్స్ అవార్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం మైలవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ ఖాసీంబీకి ఉమెన్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2023 లభించింది. ఆమె చేసిన సేవలను గుర్తించిన సికింద్రాబాద్‌కు చెందిన రేడియంట్ పెరఫామెన్స్ అండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఇటీవల అక్కడ ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసింది. సంస్థ డైరెక్టర్ గీత కృష్ణ, షేక్ దత్తేశ్వర్, పోలీస్ అధికారి శ్యామల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఖాసీంబీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం మహిళలకు తన వంతు సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు.



చాట్రాయి మండలంలో భారీ వర్షం




చాట్రాయి: చాట్రాయి మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. చిన్నంపేట తమ్మిలేరు వాగు నుంచి సీకేపాడు చానల్ ద్వారా చెరువులకు వరద నీరు చేరుతోంది. మండలంలోని రేగడి వాగు, ఉప్పు వాగుల్లో ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. తమ్మిలేరు రిజర్వాయర్‌కి 580 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు. మండలంలో 40 మి. మీ వర్షపాతం నమోదైందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఈశ్వరరావు తెలిపారు.

విస్సన్నపేటలో 86 మి.మీ వర్షపాతం నమోదు..

విస్సన్నపేట: విస్సన్నపేటలో బుధవారం రాత్రి 86.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం అధికంగా పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది.

ముత్యాలమ్మ అమ్మవారికి ఆషాఢ సారె

జి. కొండూరు: రుద్రవరం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లు, ఫలహారాలు తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ ధార్మిక కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com